


# మని ఆర్డర్

మూలం : తక్కజి శివశంకర పిళ్లై
అనువాదం : అఫ్సర్

గుంపులాగా వచ్చిపడ్డారు జనం.

అధికారులు చాలా ఓపికగా ఒక్కొక్కర్నీ పరీక్షించారు. వాళ్ల బరువూ, ఎత్తూ వగైరా వగైరా. ఆ గుంపులో రామన్ కూడా ఉన్నాడు. బరువూ, ఎత్తూ అన్నీ సరిపోనూ ఉన్నాడు రామన్.

"నీ తండ్రి పేరేమిటి?"

"నీ అడ్రస్సేమిటి?"

"ఇంతకు ముందు ఎక్కడున్నావు? ఇప్పుడేం చేస్తున్నావు?"

అందరూ అన్ని ప్రశ్నలకూ సమాధానమిచ్చారు కానీ, రామన్ దగ్గర వాటిల్లో ఒక్క ప్రశ్నకి కూడా సమాధానం లేదు. అన్నిటికీ లేదని అడ్డంగా తలూపి నిల్చున్నాడు.

ఆ పరీక్షలో దాదాపు వందమంది భర్తీ అయ్యారు. వాళ్లల్లో అదృష్టం బాగుండి రామన్ పేరు కూడా ఉంది.

అంతే ఆ తర్వాత రామన్‌కి ఈ ప్రపంచంతోనే సంబంధం తెగిపోయింది. ఒక సుదీర్ఘ ప్రయాణం. ఎక్కడో మజిలీ. మూడుపూటలా కడుపునిండా తిండి, జేబు ఖర్చులకు కొంచెం డబ్బు తోడు ఉన్నవాళ్లు కూడా బలే తమాషా అయినవాళ్లు. నవ్వు తప్ప వాళ్లకు వేరే లోకం లేదు.

వ్యాన్ ఎన్నో కొత్త ప్రదేశాల మీదుగా ప్రయాణిస్తోంది. ఎన్నో గ్రామాలు, నగరాలు. ఇంత విశాలమైన ప్రపంచాన్ని రామన్ చూసి ఎరగడు. వారం రోజుల తర్వాత వ్యాన్ ఒకచోట ఆగిపోయింది. ఫలానా అని గుర్తుపెట్టుకోవడానికి వీలు లేని చోటు అది.

మిలిటరీ ట్రైనింగ్ అంటే మాటలు కాదు. అయితేనేం, కడుపునిండా తిండి. ఆ

ఆలోచనతోనే అతని కడుపు నిండిపోతోంది. తిండి మాత్రమేనా? ఎన్ని గొప్ప అనుభవాల్లోకి ఎంత కొత్త జీవితంలోకి తాను అడుగుపెడ్తున్నాడో! ... క్షణం క్షణం కడుపు నింపుకోవడానికి రామన్ శతవిధాలా ప్రయత్నిస్తున్నాడు. ఇప్పుడేం తక్కువైందని? పడుకోడానికి మంచం ఉందా? తల దాచుకోవడానికి ఇంత నీడ ఉందా? ఏదైనా చేయడానికి చేతినిండా పని ఉందా? అదేమైనా కావచ్చు: ఏదో ఒక పని.

పట్టుమని పదిరోజులు ఒకేచోట ఉన్నది లేదు. దాదాపు మూడు రోజులకో కొత్త ప్రదేశం. కొత్త పరిసరాలు. కొత్త మనుషులు. దేశంలోని దాదాపు అన్ని నగరాలు అతను చూసి ఉంటాడు.

రోజులు అలా గడిచిపోయాయి. ఒకరోజు కమాండర్ ఆదేశాలు అందాయి. "నెలరోజులు సెలవిస్తున్నాం. ఎవరి ఊళ్లకు వాళ్లు వెళ్లిపోవచ్చు!" అని.

ఆ మాట విని తన తోటి వాళ్లంతా ఎగిరి గంతువేశారు. ఒకరి నొకరు కౌగలించుకున్నారు, ఆనందం పట్టలేక. కానీ రామన్‌లో ఏ కదలికా లేదు. వాళ్ల పిచ్చి సంతోషానికి అర్థమూ తెలియడంలేదు.

ఆ రాత్రి అంతా వాళ్ల వాళ్ల ప్రయాణాల గురించే మాట్లాడుకుంటున్నారు.

"ఒరే, మనిద్దరం కలిసే బయల్దేరదాం!" అని ఒకడంటున్నాడు.

"లేదు, భాయ్! నేను ముందే బయల్దేరి వెళ్లాలి!" రెండవవాడి సమాధానం.

"సర్లేవోయ్! నేనూ పరుగు పుచ్చుకొని ముందే వెళ్లిపోతాను. నా చిన్ని బుజ్జిముండని ముద్దెట్టుకుని ఎంతకాలమయిందో తెలుసా?"

"తొందరగా వెళ్లిపోవాలమ్మా. నేను ఎక్కడున్నానో ఏం చేస్తున్నానో మా అమ్మకు తెలిసే తెలియదు. ఇంట్లో చెప్పా పెట్టకుండా వచ్చేశాను."

మాటల మధ్యలో ఎవరో రామన్‌ని కూడా అడిగారు.

"ఏం భాయ్, నువ్వెప్పుడు బయల్దేరుతున్నావ్? నీ తోడు నేను రానా?"

"సరే!" అని నిర్జీవంగా సమాధానమిచ్చాడు రామన్.

రామన్ ఆలోచనలో పడ్డాడు. ఈ నెలరోజులు తను ఎక్కడికి వెళ్లాలి? తనకోసం ఎదురు చూసేవాళ్లు ఎవరున్నారు? ఒక తల్లా, పెళ్లామా, చెల్లెలా? ఎవరున్నారు?

ఆ రాత్రి ఎవరి కంటిమీదా ఒక్క కునుకు వాలలేదు. నెలరోజుల సెలవు. ఇంటికి వెళ్లాలి. భార్యాపిల్లల్తో సరదాగా గడపాలి. ఇవే ఆలోచనలతో సతమతమవుతున్నారు అంతా.

రామన్ పక్కన పడుకున్న దోస్తు అడిగాడు "మీ ఇంట్లో ఎవరెవరుంటారు?"

"ఎవరూ లేరు."

"సెలవుల్లో ఏం చేస్తావ్ మరి?"


రామన్ దగ్గర సమాధానం లేదు.

"మీది తిరువనంతపురమే కదా?"

దానికి కూడా అతను జవాబివ్వలేదు. కాసేపాగి.. "ఆ, నేను పెరిగిన ఊరు మాత్రం అదే!" అన్నాడు.

"మరి పుట్టిన ఊరు"

"నేను ఈ సెలవుల్లో ఎక్కడికీ పోను!" అని విసుగ్గా సమాధానమిచ్చాడు. పక్కకు తిరిగి పడుకోబోయాడు రామన్.



"నా మీద విసుక్కుంటావేం వెర్రి నాగన్నా! ఇంట్లో తగూపడి వచ్చావా బాబూ?" అన్నాడు దోస్తు నవ్వుతూ.

ఆ తర్వాత రామన్ పెదవి విప్పలేదు.

***

రాత్రి మూడోఝాము. అందరూ గాఢనిద్రలో ఉన్నారు. రామన్‌కి ఎంత ప్రయత్నించినా నిద్ర రావట్లేదు. కాసేపు అటూ ఇటూ మసిలాడు. లేచి కూర్చున్నాడు. 'రామన్' అని తనకెవరు పేరు పెట్టారో! ఎవరో? తల్చుకుంటే అతనికే ఆశ్చర్యంగా ఉంది. మరి ఆ రామన్ చివర 'అయ్యర్' అని తోకపెట్టిందెవరో? రామన్ అయ్యర్ అని మొట్టమొదట తన నెవరు పిలిచారో? అతనికేమీ గుర్తు లేదు. వీథుల్లో పడి అడుక్కుంటున్నప్పుడు తనకు ఓ పేరూ, పాడూ లేవు. తనని ఎవరూ పేరు పెట్టి పిలవగా అతను వినలేదు.

"ఈ సెలవుల్లో నేను ఎక్కడికీ పోను!" పదే పదే ఆ మాట అతని చెవుల్లో మోగిపోతోంది.

ఎక్కడకని వెళ్తాడు తను? ఈ దేశంలో ఏ ఊళ్లో ఏ మూల తన తల్లిదండ్రులు ఉన్నారో! తనకో తల్లీ తండ్రీ ఉంటే వాళ్లు కూడా ఈ కొడుకు కోసం ఎంత ఆశగా, ఎంత ప్రేమగా ఎదురు చూస్తుండేవాళ్లో! తనకో అన్నయ్యా, ఓ తమ్ముడూ, ఓ చెల్లీ కూడా ఉంటే ...! నిజంగా ఉంటే...!

ఛీ... ఇదేం ఆలోచనా? "ఉండి వుంటే" అనుకోవడం ఎంత బాధాకరంగా ఉంటుందో!

ఆ కొబ్బరి చెట్ల చల్లటి నీడలలో అక్కడి పిచ్చిగాలి కేరింతల్లో హాయిగా నిద్రపోతూ! ఈ దిక్కుమాలిన రామన్ అయ్యర్! పచ్చపచ్చని ఆ పల్లెలో ఎటు చూసినా రామన్ అయ్యర్! అక్కడ పండిన పిడికెడు గింజలతో కడుపునిండా తిండి. తల్చుకుంటేనే రామన్‌కి కన్నీళ్లు పొంగాయి.

తనకోసం ఎదురు చూసేవాళ్లు ఎవరూ లేరు. కాగడాలు పెట్టి వెతికినా తన వాళ్లెవరూ ఈ భూమ్మీద కనిపించరు.

అయినా ఆ కొబ్బరి చెట్ల చల్లటి నీడలలో అక్కడి పిచ్చిగాలి కేరింతల్లో హాయిగా నిద్రపోతూ! ఈ దిక్కుమాలిన రామన్ అయ్యర్! పచ్చపచ్చని ఆ పల్లెలో ఎటు చూసినా రామన్ అయ్యర్! అక్కడ పండిన పిడికెడు గింజలతో కడుపునిండా తిండి. తల్చుకుంటేనే రామన్‌కి కన్నీళ్లు పొంగాయి. ఆ క్షణమే అతను అనుకున్నాడు 'కేరళ వెళ్లాలి!'

మరునాడు అందరికంటే ముందు లేచి కూర్చున్నాడు రామన్. మిగతావాళ్లు లేచి కూర్చునేసరికే రామన్ పెట్టే బేడా తీసుకుని నిలబడ్డాడు బయలుదేరడానికి.

***

అదొక ఊరు.

రెండు మూడు రోజులుగా అక్కడి వీథుల్లో ఒక

సిపాయి చిన్నోడు తిరుగుతున్నాడు. అతనెవరో, ఎక్కణ్ణుంచి వచ్చాడో ఎవరికీ తెలీదు. చేతిలో ట్రంకుపెట్టె పట్టుకుని ఒకరోజు ఒక ఇంటిముందు నిలబడ్డాడు. ఆ ఇంటి తలుపులు మూతపడి ఉన్నాయి. మిలటరీ బట్టల్లో ఉన్న రామన్‌ని చూసి ఒక కుర్రాడు దగ్గరకొచ్చాడు.

"ఈ ఇంట్లో ఎవరూ ఉండట్లేదు!" అన్నాడు. రామన్ ఏమీ అడక్కముందే.

ఆ కుర్రాడు కాసేపు ఎగాదిగా చూసి వెళ్లిపోయాడు. రామన్ వెనుదిరిగి మళ్లీ నడక మొదలెట్టాడు.

దారిలో ఒకతను ఎదురయ్యాడు. అతని వెనకెనగ్గా వెళ్లాడు రామన్. కొద్దిసేపలా నడిచాక సంకోచంగా మాటలు కలిపాడు.

"నేను నీ పాత దోస్తుని, రామన్‌ని!" అన్నాడు.

"రామన్... ఏ రామన్?" కనుబొమలు ముడేసి అడిగాడు ఆ వ్యక్తి.

రామన్ ఎంతోసేపు అతనికి తనెవరో ఏమిటో చెప్పాడు కానీ అతనికేమీ గుర్తు రాలేదు.

అక్కణ్ణుంచి ఒక హోటల్లోకి వెళ్లాడు. ఒక గోడమీద ఓ మూల 'రామన్' అని కత్తితో చెక్కిన అక్షరాలు కనిపించాయి. హోటల్ వాడికి ఆ అక్షరాల్ని చూపించి "ఆ అక్షరాలు కత్తితో చెక్కింది నేనే!" అన్నాడు.

హోటల్‌వాడు అతనివైపు ఎగాదిగా చూసి ఊరుకున్నాడు. అతనికి కూడా రామన్ గుర్తు రాలేదు. నచ్చచెప్పి లాభం లేదనుకున్నాడు రామన్.

అట్లా ఎన్ని రోజులు గడిచాయో లెక్కలేదు. తీరా చూస్తే సెలవులు అయిపోవస్తున్నాయి. తనని చూసి ఒక్క మనిషి అయినా చిరునవ్వు కూడా సమాధానమివ్వలేదు.

"అరే, నువ్వా రామన్?" అని ఎంతోమంది ఆప్యాయంగా ఆశ్చర్యంగా అడుగుతారనుకున్నాడు రామన్. కానీ ఒక్కళ్లూ అలా అడిగిన పాపాన పోలేదు.

***

పట్టణం ఫాడ గిట్టని మారుమూల పల్లె అది. ప్రశాంతమైన వాతావరణం. నలుదిక్కులా కొండలు, చెట్లూ. పల్లెకి దూరంగా ఒక గుడిసె. ఆ గుడిసె అరుగుమీద కూర్చుని రామన్ భోం చేస్తున్నాడు.

అది అలా అలవాటయిన ఇల్లులాగా, అక్కడ ఉన్నవాళ్లు తనకెంతో ఆప్తులయినట్టు రామన్ చాలా తాపీగా కూర్చుని ఉన్నాడు; ఒక ముసలావిడ దగ్గరగా కూర్చుని కొసరి కొసరి వడ్డిస్తోంది. 'అది కాదమ్మా...' అని చాలా ఆప్యాయంగా ఆమెతో మాట్లాడుతున్నాడు రామన్.

"అమ్మా! మీ కెవరూ మగపిల్లలు లేరా?" అడిగాడు రామన్.

ఆమె కళ్లు అశ్రుపూరితాలయ్యాయి. "ఇచ్చినట్టే ఇచ్చి దగ్గరకి లాక్కున్నాడు దేముడు. వాడే బతికి ఉంటే నిండా పాతికేళ్లు ఉండేవి. ఈ 'పారు'ముండ ఉందిగా. దీనికంటే రెండేళ్లు చిన్నోడు. వాడే ఉంటే చెట్టంత అండ ఉండేది!" అంటూనే వడ్డిస్తోంది ముసలావిడ.

"ఇంక చాలు, చాలమ్మా! మరీ ఎక్కువ వడ్డించేస్తున్నావు మాటల్లోనే!" అని చెయ్యి అడ్డం పెడ్తున్నాడు రామన్.

"నీకు తప్ప ఇంకెవరికని వడ్డిస్తాను. తిను బాబూ, తిను! నిన్ను చూస్తుంటేనే కడుపు నిండిపోతోంది నాకు!" అంటోంది ముసలావిడ.

రామన్ ఆవిడ చూపిన ఆప్యాయతకి కరిగి నీరయ్యాడు. పుట్టి బుద్దెరిగిన తర్వాత ఎవరూ అతన్ని ఇంత ప్రేమగా పలకరించి ఉండరు. కడుపారా తిని మంచంమీద మేను వాల్చాడు రామన్. కానీ, అతని కంటిమీద కునుకు లేదు.

ముందు మండువాలోకి వచ్చి పచార్లు చేయసాగాడు. ఎప్పుడో వదిలేసిన ఈ పల్లెలో ఎవరో తెలియని ఇంట్లో ఇంత ఆప్యాయత దొరుకుతుందని అతనూహించలేదు. వచ్చినరోజే ఆ ఇంట్లో అతనొక భాగస్వామి అయిపోయాడు. జీవితంలోనే మొట్టమొదటిసారి "అమ్మా!" అని హాయిగా పిలిచే అవకాశం దొరికింది. 'తన'వాళ్లు అనుకోవడానికి ఒకళ్లు దొరికారు. నవమాసాలు మోసి కనలేదేమో కాని, కన్నతల్లికన్నా ప్రేమగా వడ్డించింది ఈ ముసలావిడ. అతని అనాథ జీవితంలో అదొక అపూర్వ ఘట్టం.

రెండవరోజు.

"నీకో సంగతి చెప్పాలమ్మా!" అన్నాడు రామన్.

"చెప్పు, బాబూ!" అని దగ్గరకొచ్చి కూర్చుంది ముసలావిడ.

"ఈ భూమ్మీద నాకంటూ నా వాళ్లంటూ ఎవరూ లేరు!" అన్నాడు భారంగా నిట్టూర్చి.


"చాలు చాల్లేవయ్యా! నిన్న కూడా అంతే అన్నావు!" అంది తేలికగా.

"నిజం, అమ్మా! నే నొక అనాథని." అతని కళ్లు తడిసి బరువెక్కాయి.

ముసలావిడ అలా కళ్లప్పగించి చూస్తూండిపోయింది.

ఆ సాయంత్రమే ఆ ఇంట్లో గొప్ప ఆర్భాటంగా ఒక పండగ జరిగింది. ఆ ముసలావిడ కూతురు 'పారూ' పెళ్లికూతురయింది. దిక్కూ మొక్కూ లేని రామనే పెళ్లికొడుకు.

రామన్ జీవితంలో ఆ రోజుతో చీకట్లు తొలగిపోయాయి. ఒక కొత్త పరిమళం అతని ఒంటిమీదకి పాకింది. ఒక పచ్చపచ్చని గాలి అలా అలా వచ్చి పైర్లమీంచి అతని గుండెల్ని వొరుసుకుపోయింది. 'పారూ' రామన్ భార్య. ఈ ఆలోచనే చాలు. అతన్ని క్షణంసేపు ఊపిరాడనివ్వడంలేదు. దారిన పోతున్నవాళ్లు తనవైపు చూడకపోయినా సరే, వాళ్లని దగ్గరకి పిలిచి మరీ పలకరించాడు. ముసలావిడ గురించి గొప్పగా చెప్పాడు. పారూ గురించి ఇంక చెప్పనే





మనిషి మరో ప్రపంచాన్ని సూటిగా స్పష్టంగా వ్యక్తం చేయగల శక్తివంతమైన కథా రచయిత తక్కజి శివశంకర్ పిళ్లే. మంచి కథా రచయిత చెప్పినదానికంటే చెప్పని కథే చాలా ఉంటుందట. పిళ్లే కథ చదివాక 'అసలు కథ' మనకే వదిలేసి వెళ్లిపోయాడే! అనిపిస్తుంది.

'చెమ్మీన్' నవలా రచయితగా తక్కజి భారతీయులకు సుపరిచితుడు. కేరళలోని ఎక్కడో మారుమూల పల్లెలో పుట్టిన పిళ్లే 1984లో జ్ఞానపీఠ్ గెలుచుకున్నాడు.

'మని ఆర్డర్' ఆయన రాసిన గొప్ప కథల్లో ఒకటి. ఒక అనాథ చావు పుటుకల కథ ఇది. ఈ కథలో మనకు పరిచయమయ్యే, రామన్ అయ్యర్ నిజానికి మనకందరికీ బాగా తెలిసినవాడే.

అక్కర్లేదు.

సెలవులైపోయాయి. ఆ రోజు రాత్రే బయలుదేరి వెళ్లాలి.

ముసలావిడ అతనివైపు దీనంగా చూసింది. పారూ చూపులతోనే అతన్ని ప్రాధేయపడింది.

"తప్పదు పారూ! ఈ రాత్రికి బయలుదేరాలి!" అన్నాడు మెల్లిగా.

"రేపు ఒక్కరోజూ ఉండకూడదా బాబూ!" అడిగింది ముసలావిడ.

కుదరదని తలూపాడు రామన్.

రాత్రి తొమ్మిది గంటలు. వెన్నెల రాత్రి. చేతుల్లో ట్రంకుపెట్టె ఊపుకుంటూ పొలాల్లో పడి వెళ్తున్న రామన్‌ని చివరికంటా చూస్తూండిపోయింది పారూ.

రామన్ వెళ్లిపోయాడు. పారూ దీనంగా వెనక్కి తిరిగింది.

రామన్ నుంచి నెలనెలా 'ఫామిలీ అలవెన్స్' వస్తోంది. ఆ అలవెన్స్‌తోనే వాళ్లకు గడుస్తోంది. ఆ డబ్బుతోనే ఇంట్లో చాలా వస్తువులు సమకూర్చుకున్నారు. ఊళ్లో వాళ్లదశ పెరిగింది. ముసలావిడ కూడా 'పారూ'ని ముండ అని తిట్టడం మానేసింది. 'పారూ' అంటే ఇప్పుడామెకు చచ్చేంత గౌరవం.

***

పొద్దున్నే లేచి గుడికెళ్తుంది పారూ. పూజ చేస్తుంది. ఇంటికొస్తుంది. చేతనయితే ఏదో ఒకటి రెండు పన్లు చేస్తుంది. ఇప్పుడు ఇంట్లో చాలా హాయిగా గడిచిపోతోంది. ఇద్దరు తినగా ఒక మనిషి అన్నం మిగిలిపోతోంది. ఏ రాత్రి కాస్త అలికిడి అయినా వాళ్లిద్దరూ లేచి కూర్చుంటారు.

"ఎవరు? వచ్చావా బాబూ?" అని ఆశగా పలకరిస్తారు. కానీ రామన్ ఎప్పుడూ రాడు. రామన్ ఎప్పుడొస్తాడా అని కళ్లల్లో వత్తులు పెట్టుకుని ఉంటుంది పారూ.

"మీ ఆయన ఎప్పుడొస్తాడే?" అని పదే పదే అడుగుతూంటారు ఆమె దోస్తులు. వాళ్లకు సమాధాన మివ్వడానికి పారూ ఏనాడూ పెదవి విప్పదు. సమాధానం ఆమెకే తెలీదు కనుక.

ఒకరోజు పోస్టమాన్ ఒక పెద్ద కవరు మోసుకొచ్చాడు. అందులో రామన్ ఫోటో ఉంది. అప్పట్నించీ అది ఆ ఇంటి గోడమీద దేవుడి ఫోటోలా వేలాడుతూ కనిపిస్తోంది.

ఒకరోజు పోలీస్ స్టేషన్ నుంచి పిలుపు వచ్చింది. రామన్‌కి సంబంధించిన మూడు ట్రంకు పెట్టెలున్నాయి, వచ్చి తీసుకువెళ్లమని.

భయపడుతూ భయపడుతూ వెళ్లి ఆ పెట్టెల్ని ఇంటికి మోసుకొచ్చింది పారూ.

అవి పెద్దపెద్ద పెట్టెలు. అందులో ఒక పెట్టెలో రామన్ బట్టలు. వాటిమీద ఎండిపోయిన ఒక పూలదండ. అది తన పెళ్లప్పుడు తాను రామన్ మెడలో వేసింది. పారూ క్షణంసేపు మౌనంగా, స్తబ్దంగా ఉండిపోయింది.

వారం రోజుల తర్వాత వెయ్యి రూపాయల చెక్కు వచ్చింది.

ఆ తర్వాత ...

ఆ ఇంటికి మళ్లీ పోస్టుమాన్ రాలేదు, మని ఆర్డరు అందివ్వడానికి.

ఎప్పుడైనా పోస్టుమాన్ వీధిలో కనిపిస్తే పారూ అడుగుతుంది. పోస్టుమాన్ అడ్డంగా తలూపి

"లేదమ్మా, నీకు మని ఆర్డర్ రాలేదు!" అనేసి వెళ్లిపోతాడు.

■

